క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు

భూపాలపల్లి అర్బన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం భగత్ సింగ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి నెరెళ్ల జోసెఫ్ తెలిపారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం చిన్న వయసులోనే వీరమరణం పొందిన భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలన్నారు. ఒద్దుల సాకేత్ రెడ్డి, ఒంటరు రమేష్, గడ్డం స్వరూప, గోలి లావణ్య, దిలీప్ పాల్గొన్నారు.

నియామకం

భూపాలపల్లి రూరల్: పారా (దివ్యాంగుల) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామానికి చెందిన కొయ్యడ కుమారస్వామి నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన సేవలు గుర్తించి రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన వారికి కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా..

రేగొండ: అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటన మండలంలోని రేపాక వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల నుంచి చిట్యాల వెళ్తున్న కారు రేపాక వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. కారులో ప్రయాణం చేస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు అద్దాలు పగిలిపోయి, వాహనం ధ్వంసమైంది. దీనిపై ఎస్సై రవికుమార్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని మంజూర్‌నగర్‌లో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావు వెంచర్లలో నివాసముండే బొమ్మకంటి కుమారస్వామి గురువారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని తొమ్మిది తులాల బంగారం, రూ.40వేల నగదు దొంగిలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం) సోలిపేట తాడిచెట్ల పరిసర ప్రాంతంలో పేకాట రాయుళ్లను భూపాలపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలిపేట తాడిచెట్ల పరిసర ప్రాంతాల్లోని పేకాట స్థావరాలపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులు భూపాలపల్లికి చెందిన రంగారెడ్డి, గణపురానికి చెందిన రాజు, శంకర్, బద్ధారానికి చెందిన రవికుమార్, గాంధీనగర్‌కు చెందిన సురేందర్, మొరంచపల్లికి చెందిన రవిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పేక ముక్కలను, రూ.50,250లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


కొమురయ్య(ఫైల్)

మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట మాజీ సర్పంచ్ కొమురయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పరామర్శించారు. మృతుడి అత్యక్రియాల్లో మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న అటెండర్ మృతి

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన అటెండర్ షేక్ రియాజ్ పాషా (30) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ రియాజ్ పాషా చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసైనట్లు తెలిపారు. దీంతో కడుపునొప్పి విపరీతంగా రావడంతో బుధవారం ఉదయం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగి తల్లికి చెప్పడంతో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. మృతుడి తల్లి షేక్ భానుబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటవీ ఎనాజీపేట గ్రామానికి చెందిన మూడెత్తుల శ్రీలత(24)అనే వివాహిత శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పోరాట యోధుడు కొమురంభీం

కాళేశ్వరం: గిరిజనుల పోరాట యోధుడు కొమురం భీం అని జిల్లా ఏటీడీఓ దేశిరామ్ నాయక్ అన్నారు. గిరిజన సంఘం నాయకులు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఏటీడీఓ మాట్లాడుతూ.. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి కొమురంభీం అన్నారు. ఆయన వల్లనే ప్రస్తుతం పోడు చేసిన భూముల్లో గిరిజనులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. మహదేవపూర్ నుంచి 2016 జిల్లాల విభజనతో ఐటీడీఓ పరిధిలోని మాడా కార్యాలయం తరలి ఏటూరునాగారం వెళ్లిదని, మళ్లీ గిరిజన నాయకులు పోరాటం చేసి ఏటీడీఓ, డీటీడీఓ పోస్టులు మంజూరు చేయిస్తే గిరిజనులకు ఎంతగానో లబ్ధి చేకురుతుందని తెలిపారు. డీజీ కృష్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, జీసీసీ మేనేజర్ హరిలాల్, ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గుర్సింగ బాపు, నాయకులు కుడిమేత సమ్మయ్య, బద్ది సమ్మయ్య, కాల్నేని రాములు, మల్లేశం, రాజేందర్, సురేష్, స్వామి, వెంకటయ్య, బాపు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వామన్‌రావు, నాయకులు గుడాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


మహదేవపూర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

భూపాలపల్లి రూరల్: ఆదివాసీల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ, గిరిజన సింగరేణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కొమురంభీం, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. అడవుల్లో దొరికిన పండ్లు, మూలికలు, జిగురు, కట్టెలను, అమ్ముకొని జీవించే అటవీ హక్కులను అమలు చేయాలని ప్రకటించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎళ్లు గడుస్తున్న ఇప్పటికి కొన్ని గ్రామాల్లో ఆదివాసీల బతుకులు మారలేదన్నారు. సంఘం నాయకులు కత్తి రమేశ్, గూడ రమేశ్, నాగరాజు, వసంతరావు, సుభాస్, అనంతరాములు, లక్ష్మీనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కుడలిలోని ఆదివాసీ కొమురంభీం విగ్రహానికి ఆదివాసీలు పాలాభిషేకం చేసి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, నాయకపోడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓల్లాల మల్లేశ్, సేవాసంఘంజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల రామచంద్రం, నాయకులు రామినేని వెంకట్రాజం, గురిసింగ మహేష్, సదువలి, వంశీరాజ్, వెంకటయ్య, కోడి అర్జయ్య, పిల్లి నాగయ్య, వినయ్, రాజేందర్, సంపత్, మల్లక్క ఉన్నారు.

మల్హర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకోని మండలంలోని కొయ్యూర్‌లో ఆదివాసీ గిరజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టం భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, డివిజన్ ఉపాధ్యక్షుడు నాగరాజు, మండల అధ్యక్షుడు గొట్టం బాపు, శంకర్, భాస్కర్, రాధకృష్ణ, తరుణ్, రామస్వామి ఉన్నారు.


భూపాలపల్లి రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న రాంబాబు


మహాముత్తారం: కొమురంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


మల్హర్‌లో..

రైతులకు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గణపురం: వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. శుక్రవారం గణపురం మండలకేంద్రం శివారు కొత్తపల్లిలోని గణపురం మార్కెట్ యార్డులో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గూటోజు కిష్టయ్య, వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారన్నారు. రైతాంగానికి సేవ చేసేందుకే వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉంటాయన్నారు. కమిటీ సభ్యులు రైతులకు నిస్వార్థంగా సేవలు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఎవరైన లీడర్లు అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదన్నారు. త్వరలోనే గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామంలోని గుట్టలపై ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ప్రధాన రహదారి నుంచి వంద పడకల ఆస్పత్రికి వెళ్లేందుకు ఇటీవల రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలి

- కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం: విద్యార్థులు ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ సాధనపై దృష్టిసారించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్ పేరిట సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోకుండా స్నేహభావంతో ముందుకెళ్లాలని సూచించారు. ర్యాగింగ్ అనేక అనార్థాలకు దారితీస్తుందని.. తోటి విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించకూడదని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకెళ్లాలని తెలిపారు. లక్ష్యసాధన కోసం కష్టపడి చదవాలని, చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మ్యాక అభినవ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

మల్హర్: మండలంలో నాగుల పంచమి వేడుకలను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కొయ్యూరు నాగులమ్మ వద్దకు మండలంలో వివిధ గ్రామాలతో పాటు చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నాగులమ్మను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మల్హర్: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

రేగొండ: మండల వ్యాప్తంగా శుక్రవారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. మహిళలు నాగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టి పలువురు మహిళలు ఆలయాల ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్ట వద్ద, నాగుల విగ్రహాల వద్ద ప్రత్యేక అభిషేకాలు చేశారు. కొడవటంచలోని లక్ష్మీనరసింహ ఆలయం, కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పిడిసిల్ల శివారు ఎల్లారెడ్డిపల్లె గ్రామంలోని నాగదేవత దేవాలయంలో నాగులపంచమి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కాళేశ్వరం: మొక్క నాటుతున్న విద్యార్థులు, అధికారులు


పలిమెల: మొక్క నాటుతున్న అధికారులు


కాటారం: మొక్కలు నాటుతున్న అధికారులు, సిబ్బంది

పలిమెల: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పంకెన, మోదేడు, లెంకలగడ్డ గ్రామాల్లో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బ్లాక్ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణ, రాజేందర్, అఫ్జల్, బీట్ ఆఫీసర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కాళేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీ శాఖ రేంజర్ రవి అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా మహదేవపూర్ జిల్లా పరిషత్, యూపీఎస్ పాఠశాలల విద్యార్థులతో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అనంతరం అటవీశాఖ కాంప్లెక్స్‌లో విద్యార్థులతో కలిసి అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు మధు, తిరుపతిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

కాటారం: మండలంలో స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజులో భాగంగా పలు గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పిచ్చి మొక్కల తొలగింపు, వనమహోత్సవం, శానిటేషన్, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. కాటారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఆవరణలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, రేంజర్ ఆసీఫ్ అలీ, ఏపీఓ వెంకన్న, ఎఫ్ఎస్ఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, ఉమాదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రేగొండ: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్ ఆధ్వర్యంలో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని రేగొండ, మడతపల్లి, భాగిర్థిపేట, జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు పంపించేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే బదిలి చేసి వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని అన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు.



సభ్యత్వాలు అందజేస్తున్న కిరణ్ కుమార్

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

కాటారం: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో శుక్రవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ కాంగ్రెస్ జెండా ఎగరవేసి కేక్ కట్ చేశారు. నాయకులు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు అన్ని వర్గాల యువతకి రాజకీయ చేయూతనందిస్తున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ పాత్ర ఎంతో గొప్పదన్నారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, విలాసరావు, తెప్పెల దేవేందర్‌రెడ్డి, అంగజాల అశోక్, నాయిని శ్రీనివాస్, కడారి విక్రమ్, చీటూరి మహేశ్, గడవేణ దేవేందర్ యాదవ్, చీమల రాజు, జాడి రాజేశ్, కుమార్‌యాదవ్, రూపేశ్, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇంటింటా మొక్కల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం అధికారులు మొక్కల పంపిణీ చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులోని కృష్ణకాలనీలో మొక్కల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి హాజరయ్యారు. ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. వార్డు కౌన్సిలర్లు ఎడ్ల మౌనిక, అంగన్‌వాడీ, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతు

మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామానికి చెందిన యువకులు బోరుకు మరమ్మతు చేపట్టి, నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని 8వ వార్డులో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని తెలియడంతో గ్రామానికి చెందిన యువకులు అడ్వాల రాజు, సురేష్, లక్ష్మణ్, దేవేందర్ హుటాహుటిన మోటార్‌ని బాగు చేయించారు. యువకులు చేసిన సేవలకు స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కాటారం: యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై మ్యాక అభినవ్ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎల్‌జీ గార్డెన్స్‌లో శుక్రవారం గంజాయి, డ్రగ్స్ సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహించాలి

చిట్యాల: జిల్లా వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల13న మండల కేంద్రంలో జరిగే తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

కాళేశ్వరం: రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని మహదేవపూర్ సీఐ రామచంద్రరావు అన్నారు. శుక్రవారం మహదేవపూర్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్స్ కలిగిన వ్యక్తులతో ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. 12 సంవత్సరాల పాటు కేసులు నమోదు కాకపోతే రౌడీషీట్స్, సస్పెక్ట్‌షీట్స్ తొలగిస్తామని అన్నారు. ఆయన వెంట కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, పలిమెల ఎస్సై తమాషారెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

మల్హర్: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్, చైల్డ్ లైన్ అధికారులు, సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. బాల్య వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని సూచించారు. బాలికను బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశ పెట్టి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, డీసీపీయూ కౌన్సిలర్ శైలజ, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ ప్రవీణ్, పంచాయతీ సెక్రటరీ సాయి చరణ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న నాగేశ్వర్‌రావు

రేగొండ: సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. మండలంలోని రేపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్లబ్ రీజియన్ చైర్మన్ నాగేశ్వర్‌రావు, జోన్ చైర్మన్ కరంచంద్ చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఐతు కిషన్, గౌరవ అధ్యక్షుడు కటకం రాజు, ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కాటారం: గంజాయి విక్రయిస్తున్న యువకుడితో పాటు కొనుగోలు చేస్తున్న మరో ముగ్గురిని శుక్రవారం పోలీసులు కాటారం మండల కేంద్రానికి సమీపంలోని చింతకాని క్రాస వద్ద పట్టుకున్నారు. ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం గంజాయి సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు చింతకాని క్రాస్ వద్ద పోలీసులు రెక్కి నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటకు చెందిన బొంతల రమేశ్ అనే యువకుడు ద్విచక్రవహనంపై గంజాయి తీసుకువచ్చి భూపాలపల్లికి చెందిన సాదు వినయ్, కొయ్యూర్‌కు చెందిన లకావత్ రాహుల్ అలియాస్ బొడ్డెశ్, కాటారంకు చెందిన జాడి గణేశ్ అనే యువకులకు అప్పగించాడు. ఈ క్రమంలో పోలీసులు గంజాయితో పాటు యువకులను అక్కడికక్కడే చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 1.4 కేజీల గంజాయిని స్వాధీనపర్చుకొని నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.28 వేలకు గంజాయి కొనుగోలు చేసినట్లు విక్రయదారుడు రమేశ్ అనే వ్యక్తి ఒప్పుకున్నట్లు ఎస్సై వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లు హరికుమార్, జంపన్న, సాంబశివరావు, శ్రీనివాస్, రఘు, లవన్, లక్ష్మీరాజం, హోంగార్డు తిరుపతి ఉన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీకి చర్యలు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో రైతు రుణమాఫీ రెండు విడతలుగా జరిగినప్పటికీ చాలామంది రైతులకు వివిధ కారణాలతో కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని కుటుంబాల్లో సభ్యుల నిర్ధారణ జరగకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్‌లో ఒక పేరు, రుణఖాతాలో మరోపేరు ఉండడం, ఇంటిపేరు కాని తన పేరుగాని మార్పు ఉండడం లాంటి పొరపాట్లు ఉన్నాయన్నారు. ఆధార్ నంబర్ సరైనది కాకపోవడం లాంటి కారణాలు ఉన్నాయన్నారు. రుణమాఫీ జరగని రైతులు తమ ఫిర్యాదులను ఏఓలు, ఏఈఓలకు లేదా జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లో అందించాలని పేర్కొన్నారు. వ్యవసాయ క్లస్టర్ల వారీగా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. బ్యాంకులో పేరు తప్పుగా ఉన్న, ఖాతా నంబర్ తప్పుగా ఉన్నా బ్యాంకు అధికారులకు నివేదించి సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఇతర సమస్యలు ఉంటే మాత్రం రాతపూర్వకంగా రైతుల దగ్గర నుంచి ఫిర్యాదులు స్వీకరించి తగు పరిష్కారం నిమిత్తం వ్యవసాయ కమిషనరేట్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు.